క్లుప్తంగా

గోశాలలో గోపూజలు



గోశాలలో పూజలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సతీమణి చర్లకోళ్ల శ్వేత లక్ష్మారెడ్డి

అబిడ్స్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణి చర్లకోళ్ల శ్వేత లక్ష్మారెడ్డి బేగంబజార్ గోశాలలో గోపూజలు నిర్వహించారు. బుధవారం ఆమె ముందుగా చుడిబజార్ వినాయక ఆలయంలో పూజలు చేశారు. అనంతరం బేగంబజార్ గోశాలలో గోవులకు గడ్డి, ఇతర తినుపదార్థాలు తినిపించి పూజలు నిర్వహించారు. అనంతరం గోరక్షాదళ్ అధ్యక్షుడు బాలకృష్ణ గురుస్వామి ఆమెను సత్కరించారు. గో ఉత్పత్తులు గో సంరక్షణకు అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గోరక్షాదళ్ సభ్యులు సంతోష్‌నాయుడు, గణేష్, చక్రపాణి, ఓంప్రకాష్ పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఉషారాణి

నాంపల్లి: తెలంగాణ మెడికల్ అండ్ పబ్లిక్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్ వన్ కేలండర్‌ను బుధవారం నిలోఫర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి.ఉషారాణి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఆర్.నాగేశ్వరరావు, కార్యదర్శి డి.రవీందర్, ఉపాధ్యక్షుడు ఎం. రవి, కోశాధికారి ఎస్.ప్రవీణ్‌కుమార్, నేతలు సురేష్, రాజ్‌కుమార్, శ్రీను నాయక్, ఎల్.నిర్మలదేవి, మాధవి, కౌసల్య పాల్గొన్నారు.

ఉప్పుగూడ విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో..

చాంద్రాయణగుట్ట: ఉప్పుగూడ విశ్వ బ్రాహ్మణ(విశ్వకర్మ) సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం కేలండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు లక్ష్మణాచారి, వెంకటా చారి, షణ్ముకాచారి, లక్ష్మీనారాయణచారి, శ్రీనివాసాచారి, కనకాచారి, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీఎం సభ్యుడిగా ఫైజల్



నియామకపత్రాన్ని అందుకుంటున్న ఫైజల్

చార్మినార్: భారత ప్రభుత్వ ఆధీనంలోని నేషనల్ కమిషన్ ఫర్ మైనార్టీస్ (ఎన్‌సీఎం) ప్యానెల్ కమ్యూనిటీ లీడర్స్ అధికార సభ్యుడిగా పాతబస్తీ లలితాబాగ్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు ఫైజల్ (మహ్మద్ ఫజల్) నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యదా షెహజాది చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలోని మైనార్టీ ప్రజల సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లి ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నామన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్ఎం

అఫ్జల్‌గంజ్: ఆర్టీసీ సమస్యలు, సలహాలు, సూచనలు, ఫిర్యాదుల కోసం గురువారం డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి రీజియన్ రీజనల్ మేనేజర్ శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. రంగారెడ్డి రీజియన్ పరిధిలోని ఎంజీబీఎస్, జేబీఎస్, దిల్‌సుఖ్‌నగర్‌ల నుంచి బయలుదేరే జిల్లా సర్వీసు బస్సులు, హైదరాబాద్ డిపో-1, హైదరాబాద్ డిపో- 2, పికెట్, మియాపూర్-1, బీహెచ్ఈఎల్, పరిగి, తాండూర్, వికారాబాద్ డిపోలకు సంబంధించిన సలహాలు, సూచనలు, ఫిర్యాదుల కోసం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు 99592 26241లో సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆస్మాన్‌ఘడ్ సీబీడీ ఏడీఈ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. లలితాబాగ్, ఈదిబజార్, జ్యోతిబాగ్, రజానగర్, కుమ్మర్‌వాడీ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అంతరాయం ఉంటుందన్నారు. ఫర్హత్‌నగర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు. బీబీకా అలావా ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2 గంటల వరకు. ఫతేషానగర్, శ్రావణి ఆసుపత్రి ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

చౌమహల్లా ప్యాలెస్..

అసఫ్ జాహీల రాచరిక పాలనకు నిలువుటద్దం

- నిజాం అంత్యక్రియల్లో ప్యాలెస్‌కు పెరిగిన ప్రాధాన్యత
- దశాబ్దాల తరువాత తెరుచుకున్న క్లాక్ టవర్ గేట్
- యూరోపియన్ శైలిలో నిర్మించిన శ్వేతసౌధం
- అప్పట్లో విదేశీ అతిథులకి చౌమహల్లా ప్యాలెస్‌లో ఆతిథ్యం



చార్మినార్: 8వ నిజాం నవాబ్ మీర్ భర్కత్ అలీఖాన్ ముకరం జా టర్కీలోని ఇస్తాంబుల్‌లో మృతి చెందినప్పటి నుంచి అంత్యక్రియలు ముగిసేంత వరకు పాతబస్తీలోని చౌమహల్లా ప్యాలెస్‌కు ప్రాధాన్యత ఏర్పడింది. దివంగత నిజాం భౌతికకాయాన్ని చౌమహల్లా ప్యాలెస్‌కు తరలించి అంత్యక్రియలు పూర్తి చేశారు. దీంతో ఈనెల 19వ తేదీ వరకు చౌమహల్లా ప్యాలెస్‌ను మూసి వేశారు. అప్పట్లో నిజాం వంశీయుల నివాస ప్యాలెస్‌గా ఈ చౌమహల్లా ప్యాలెస్ ఉండేది. అందుకే దివంగత నిజాం నవాబ్ మీర్ భర్కత్ అలీ ఖాన్ ముకరం జా అంత్యక్రియలకు చౌమహల్లా ప్యాలెస్ వేదికగా మారింది. యూరోపియన్ శైలిలో అత్యంత ఆకర్షణీయంగా పాలరాతి వలే నిర్మితమైన చౌమహల్లా ప్యాలెస్ చార్మినార్ కట్టడానికి దగ్గరలోని ఖిల్వత్‌లో ఉంది.

రెండో నిజాం కాలంలో..

- అసఫ్ జాహీల రాచరిక పాలనకు పాతబస్తీలోని చౌమహల్లా ప్యాలెస్ అద్దం పడుతుంది.
- రెండో నిజాం కాలంలో చార్మినార్-లాడ్ బజార్‌కు అతి సమీపంలో ఈ ప్యాలెస్ నిర్మాణం జరిగింది.
- ఆహ్లాదకరమైన వాతావరణంలో చూడముచ్చటగా ఉంది. సందర్శకులకు కనువిందు కలిగిస్తుంది.
- ఉదయం నుంచి సాయంత్రం వరకు మ్యూజియం సందర్శన ఉంటుంది. నిజాం కాలంలో వినియోగించిన ఫర్నీచర్, మంచాలు, దుస్తులు, తల్వార్లు, ఫొటోలు తదితర విలువైన పురాతన వస్తువులన్నింటిని చౌమహల్లా ప్యాలెస్‌లోని నాలుగు ప్యాలెస్‌లలో భద్రపరిచారు.
- ప్రస్తుతం నిజాం ట్రస్ట్ పర్యవేక్షణలో చౌమహల్లా ప్యాలెస్ కొనసాగుతోంది.



క్లాక్ టవర్ గేట్‌ను తెరిచిన దృశ్యం

యూరోపియన్ శైలిలో శ్వేతసౌధం..

- చార్మినార్ కట్టడం నుంచి వాకబుల్ డిస్టెన్స్‌లో ఉన్న ఈ చౌమహల్లా ప్యాలెస్ యూరోపియన్ శైలిలో నిర్మించిన శ్వేతసౌధం.
- ఇది నాలుగు ప్యాలెస్‌ల సముదాయం. ఏకాంతం (ఖిల్వత్)గా నిర్మించిన ఈ ప్యాలెస్‌లో పలు నిర్మాణాలు జరిగాయి.
- 5వ నిజాం అఫ్జల్-ఉద్-దౌలా-బహదూర్ పాలనా (1857-69) కాలంలో ఖిల్వత్ ప్యాలెస్‌లో నాలుగు ప్యాలెస్‌ల నిర్మాణం జరిగింది.
- టెహ్రాన్‌లోని షా ప్యాలెస్‌ను పోలిన ఆర్కిటెక్చర్‌లో ఐదో నిజాం అఫ్తాబ్ మహల్, మహ్తాబ్ మహల్, తహనియత్ మహల్, అఫ్జల్ మహల్‌ల నిర్మాణం జరిగింది.
- 1912లో ఏడో నిజాం ప్యాలెస్‌కు చేయించిన మరమ్మతులతో ప్యాలెస్ మరింత శోభాయమానంగా మారింది.

నిజాం ప్రభువుల నివాస గృహంగా..

- ఇది నిజాం ప్రభువుల నివాస గృహంగా ఉన్న ఇది దాదాపు 2.90 లక్షల గజాల విస్తీర్ణంలో విశాలమైన ప్రాంగణంలో నిర్మించబడింది.
- ఆనాటి కాలంలో విద్యుత్ లైట్లు లేని కారణంగా ప్యాలెస్‌లో వెలుగుల కోసం షాండిలియర్లను ఏర్పాటు చేశారు. వీటిలో పొగరాని కొవ్వత్తులు, మైనపు ఒత్తులు ఏర్పాటు చేసేవారు.
- ప్రస్తుతం విద్యుత్ దీపాలు ఉండడంతో షాండిలియర్లు దేదీప్యమానంగా వెలుగుతూ చౌమహల్లా ప్యాలెస్‌కు మరింత శోభను తీసుకువస్తున్నాయి.

తెరుచుకున్న క్లాక్ టవర్ గేట్..

- 1915లో చౌమహల్లా ప్యాలెస్ ప్రధాన గేట్ వద్ద అతిపెద్ద గడియారాన్ని ఏర్పాటు చేశారు.
- విదేశాల నుంచి వచ్చే అతిథులందరికీ చౌమహల్లా ప్యాలెస్‌లో ఆతిథ్యమిచ్చేవారు.
- నిజాం వంశస్తుల పరిపాలన ముగిసిన అనంతరం ఈ క్లాక్ టవర్ గేట్‌ను మూసి వేశారు. తిరిగి దివంగత నిజాం అంత్యక్రియలను పురస్కరించుకుని తెరిచారు.
- ఈ గేట్ ద్వారానే నిజాం పార్థీవదేహాన్ని ప్యాలెస్‌లోని ముబారక్ మహల్‌కు తరలించారు.
- కుటుంబసభ్యులు, వీఐపీలు, బంధుమిత్రులు నిజాం పార్థీవదేహాన్ని సందర్శించడానికి అవకాశం కల్పించారు. అంతిమ యాత్ర కూడా ఈ గేట్ ద్వారానే మక్కా మసీదు వరకు కొనసాగింది.

క్రమశిక్షణ గల నాయకుడు కరుణాకర్: దత్తాత్రేయ



దేవర కరుణాకర్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ

గోల్కొండ: దేవర కరుణాకర్ మృతి వల్ల క్రమశిక్షణ గల నాయకుడిని కోల్పోవడం జరిగిందని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. కార్పొరేటర్ దేవర కరుణాకర్ కుటుంబసభ్యులను ఆయన గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ.. సుదీర్ఘ రాజకీయ అనుభవం గల దేవర కరుణాకర్ ఎప్పుడూ కూడా ఒక క్రమశిక్షణ గల కార్యకర్తగా ఎదిగారన్నారు. ప్రజలతో ఎంతో కలిసిమెలసి ఉండేవారని, సమస్యల పరిష్కారానికి ఆయన ఎప్పుడూ కూడా తపన పడేవారన్నారు. ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శమన్నారు. ఈ సందర్భంగా ఆయన దివంగత నేత భార్య దీపా, కుమారుడు వంశీని ఓదార్చారు. ఆయన వెంట బీజేపీ నాయకుడు దేవర శ్రీనివాస్ ఉన్నారు.

'కొత్త కథలు' పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో వంశీ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో 66 మంది రచయితలు రచించిన 'కొత్తకథలు'పుస్తకావిష్కరణ సభ బుధవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అధికార భాషా సంఘం చైర్మన్ మంత్రి శ్రీదేవి మాట్లాడుతూ.. సినీ నటుడు గొల్లపూడి మారుతిరావు స్మరణలో కథా సంకలం ఆవిష్కరించడం ఎంతో అభినందనీయమన్నారు. తొలి ప్రతిని ఎన్నారై డాక్టర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి స్వీకరించారు. అంతకు ముందు నిర్వహించిన లలిత సంగీత కార్యక్రమం ఆహూతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సన్‌షైన్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ ఏవీ.గురువారెడ్డి, ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, తానా పూర్వ అధ్యక్షులు తోటకూర ప్రసాద్, ఎస్.ఆర్.ఐ శారద, నిర్వాహకులు వంశీ రామరాజు, సుధాదేవి తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీదేవి తదితరులు

బీజేపీ సంబరాలు



సుల్తాన్‌బజార్: బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా రెండోసారి జేపీ నడ్డా ఎన్నిక కావడంపై బీజేపీ శ్రేణుల్లో ఆనందోత్సవాలు వెల్లివిరిశాయి. ఈ మేరకు బుధవారం జాంబాగ్ డివిజన్‌లో బీజేపీ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా జేపీ నడ్డా ఎన్నిక కావడాన్ని ప్రజలు హర్షిస్తున్నారన్నారు. ఆయన అధ్యక్షతన దేశంలో బీజేపీ అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మయూర్, అనిల్‌యాదవ్, రామకృష్ణ, రఘు, కల్పన, జగపతి, సందీప్, హరినాథ్, సురేష్, రమాకాంత్, శ్రీరామ్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లోని గౌలిపురా చౌరస్తాలో బుధవారం మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీ రామారావు వర్ధంతిని నగర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి బీవై. శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాకుత్‌పురా నియజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఎం.ఎ. షేక్ షఫిక్ షర్ఫన్ పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దో రోజు రవీంద్ర చారి, కార్యదర్శి డాక్టర్ ఆవుల భరత్ ప్రకాశ్, మాజీ కార్పొరేటర్ జి.శంకర్ ముదిరాజ్, సల్లా రాజ్ కుమార్, కె.కుమార్ స్వామి, రాములు, దుర్గేశ్ కుమార్ ముదిరాజ్, ఎం.యాదయ్య, మాల మాధవ్ రావు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాను మెరుగుపరచాలి



జలమండలి జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న కృష్ణ తదితరులు

గోల్కొండ: తమ బస్తీకి నీటి సరఫరాను మెరుగుపరచాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కురకుల కృష్ణ అన్నారు. ఈ మేరకు ఆయన కాంగ్రెస్ నాయకులు, మహిళలతో కలిసి గుడిమల్కాపూర్‌లోని జలమండలి కార్యాలయంలో జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎన్నో ఏళ్లుగా తమ బస్తీకి అర్ధరాత్రి సమయంలో నీటి సరఫరా అవుతుందని ఆ వినతిపత్రంలో ఆయన పేర్కొన్నారు. దశాబ్దాలుగా తాము నీటి సరఫరా వేళలను రాత్రి నుంచి పగటిపూటకు మార్చాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఎరుకల బస్తీకి జలమండలి అధికారులు కక్ష్యకట్టినట్లు వ్యవహరిస్తున్నారని ఆయన అన్నారు. తమ బస్తీని ఆనుకుని ఉన్న ఇతర ప్రాంతాలకు పగటిపూట గంటసేపు నీరు సరఫరా అవుతుందని, తమ బస్తీకి పట్టుమని అరగంట కూడా నీరు రావడం లేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆ ప్రాంత మేనేజర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని జలమండలి అధికారులు ఆయనకు హామీ ఇచ్చారు.

ర్యాలీగా..

అంతకు ముందు ఆయన ఆధ్వర్యంలో కార్వాన్ హనుమాన్ స్ట్రీట్ ఏకలవ్య నగర్ నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో ఆయన ర్యాలీగా జలమండలి కార్యాలయానికి తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏళ్లు గడుస్తున్నా అధికారులు బస్తీ సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ నాయకులు చంటిబాబు తదితరులున్నారు.

షేక్‌పేట్‌లో వేగంగా అభివృద్ధి పనులు



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ మహ్మద్ రాషెద్

గోల్కొండ: షేక్‌పేట్ డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని బల్దియా స్టాండింగ్ కమిటీ సభ్యుడు, షేక్‌పేట్ కార్పొరేటర్ రాషెద్ ఫరాజుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన డివిజన్‌లోని పలు బస్తీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమస్యల పరిష్కారానికి తాను ప్రణాళికబద్ధంగా ముందుకుసాగుతున్నానన్నారు. స్థానికులను కలుసుకుంటూ తాను వారి సమస్యలను అక్కడికక్కడే తెలుసుకుంటున్నానన్నారు. ఆయా ప్రాంతాల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి పరిష్కరిస్తున్నానన్నారు. ఆయన వెంట పలువురు మజ్లిస్ నాయకులు ఉన్నారు.

మరాఠ సమాజ్ క్రికెట్ టోర్నీ విన్నర్‌గా హరిపంత్ వారియర్స్



విజేతగా నిలిచిన హరిపంత్ వారియర్స్ టీం సభ్యులు

అబిడ్స్: తెలంగాణ మరాఠ సమాజ్ ప్రీమియర్ లీగ్, ఎంపీఎల్-2 క్రికెట్ పోటీలో విన్నర్‌గా హరిపంత్ వారియర్స్ జట్టు నిలిచింది. విజేత జట్టును గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు పప్పుమాత్రే సన్మానించి అభినందించారు.

అలరించిన నృత్య కేళి



నవ్యశ్రీ దంపతులను సత్కరిస్తున్న బాగవతుల సేతురాం, చొక్కాపు వెంకటరమణ

నాంపల్లి: రవళి ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి తెలుగువర్సిటీ ఆడిటోరియంలో సంక్రాంతి కూచిపూడి నృత్య కేళి-2023 జరిగింది. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కాపు వెంకటరమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నాట్యరత్న అవార్డు గ్రహీత ప్రొఫెసర్ భాగవతుల సేతురామ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం నవ్యశ్రీ దంపతులకు గురు సత్కారం జరిగింది. ఈ కార్యక్రమంలో నాట్య కళా మయూరి డాక్టర్ ఆర్.ప్రసన్న రాణి, వ్యక్తిత్వ వికాస నిపుణులు తుమ్మా బాల గంగాధర రావు, నాట్య కౌస్తుభ నవ్య శ్రీ సందీప్, రవళి వ్యవస్థాపకులు రవళి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేయించాలి



విద్యుత్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో పాత కాలం నాటి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు నేటికీ ఉన్నాయని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. విద్యుత్ సమస్యలపై బుధవారం ఆయన రేతిబౌలిలో విద్యుత్ శాఖ అధికారులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎన్నో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. తరచూ ఆ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు భారీ పేలుడు శబ్దంతో కాలిపోతున్నాయని, దీని వల్ల స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నార పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె లేకపోవడం వల్ల కూడా ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మలు క్రమం తప్పకుండా పరిశీలిస్తూ వాటిలో లోపాలు ఉంటే వెంటనే సరిచేయాలని ఎమ్మెల్యే సూచించారు.

'ప్రత్యేక అభిరుచి కలవారు లలిత కళల్లో రాణిస్తారు'

విజయనగర్‌కాలనీ: ప్రత్యేక అభిరుచి కలవారు లలిత కళల్లో రాణిస్తారని జేఎన్ఏఎఫ్ఏయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ కవిత దరియానిరావు అన్నారు. బుధవారం మాసబ్‌ట్యాంక్‌లోని జవహర్‌లాల్‌నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ ప్రాంగణంలోని సెమినార్ హాల్‌లో ఉన్నతాధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ కవిత దరియానిరావు మాట్లాడుతూ.. యూనివర్సిటీ ఆధ్వర్యంలో గురువారం అత్యంత ప్రతిష్టాత్మకంగా 4వ స్నాతకోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల్లో ఆరుగురికి పీహెచ్‌డీ, 114 మందికి బంగారు పథకాలు, 612 డిగ్రీలతో పాటు ఇతర యోగ్యతా పత్రాలను స్నాతకోత్సవంలో అందజేస్తామన్నారు. అనివార్య కారణాల వల్ల మూడేళ్ల నుంచి నిర్వహించలేకపోయిన కాన్వొకేషన్‌ను ఈ సంవత్సరం ఘనంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేఎన్ఏఎఫ్ఏయూ అకాడమిక్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వినోద్ గణేష్, ప్రొఫెసర్ ఎస్.కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు కోమటిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, విష్ణువర్ధన్, కాలేజీ ఆఫ్ ఫైనార్ట్స్ ప్రిన్సిపాల్ గంగాధర్, ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కవిత దరియానిరావు


గోశాలల నిర్వహణ బాధ్యతలు ప్రభుత్వం తీసుకోవాలి

సుల్తాన్‌బజార్: గోశాలల నిర్వహణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుని అందుకు తగిన ఆర్థిక సాయం అందించాలని కోరుతూ హైకోర్టులో తాము వేసిన రిట్ పిటిషన్ 105/2020 పై స్పందించిన న్యాయస్థానం గోశాలల బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుని నిర్వహణకు నిధులు కేటాయించాలని ఆదేశాలు జారీ చేసిందని భారతీయ ప్రాణిమిత్ర సంఘ్ అధ్యక్షుడు జష్‌రాజ్ శ్రీశ్రీ మాల్ తెలిపారు. ఈ మేరకు బుధవారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో హైకోర్టు న్యాయవాది జీఎల్.నరసింహారావుతో కలిసి ఆయన మాట్లాడుతూ.. కరోనా వల్ల ఏర్పడ్డ ఆర్థిక మాంద్యం వల్ల రాష్ట్రంలో గోశాలల నిర్వహణ భారంగా మారిందన్నారు. ప్రభుత్వమే గోశాలలు నడపాలని సెక్షన్ 17 చెబుతుందన్నారు. చత్తీస్‌ఘడ్, హర్యానా, రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వాలు వందల కోట్లు వెచ్చించి గోశాలల బాధ్యతలు తీసుకున్నాయన్నారు. దాతలు సహాయంతో కొందరు సొంత డబ్బులు వెచ్చించి కొందరు గోశాలలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా తక్షణమే నిధులు కేటాయించి విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 వేలు, హైదరాబాద్ నగరంలో రిజిస్టర్ గోశాలలు దాదాపు 150 ఉన్నాయన్నారు. వధకు తరలిస్తుండగా కాపాడిన గోవులే ఎక్కువగా ఉన్నాయని వివరించారు. 14 ఏళ్ల నిండని గోవుల్ని వధించవద్దని నాటి కాంగ్రెస్ సీఎం నల్లారి కిరణ్ కుమార్ గోవధ నిషేధ చట్టం అమలులో ఉన్నా విచ్చలవిడిగా గోవధ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గోశాలల నిర్వాహకులు దీపక్, విజయ్ వర్గీ, పురుషోత్తం గుప్తా తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ప్రాణిమిత్ర సంఘ్ అధ్యక్షులు జష్‌రాజ్ శ్రీశ్రీ మాల్

ముగిసిన లిటిల్‌ఫ్లవర్ ప్లాటినం జూబ్లీ వార్షికోత్సవం



అబిడ్స్: లిటిల్‌ఫ్లవర్ హైస్కూల్ ప్లాటినం జూబ్లీ వార్షికోత్సవ వేడుకలు ప్రిన్సిపాల్ రేవ్‌బ్రదర్ షాజహాన్ ఆంటోని ఆధ్వర్యంలో బుధవారం ముగిశాయి. పలు సాంస్కృతిక నిర్వహించి అందరిని అలరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రేవ్ బ్రదర్ షాజహాన్ ఆంటోని మాట్లాడుతూ.. 70 వసంతాలుగా విద్యారంగంలో తమ పాఠశాల నాణ్యమైన విద్యను బోధిస్తూ విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు సంపత్‌కుమార్, పీఈటీ అజిత్‌కుమార్, మూర్తి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'కు సర్వం సిద్ధం



డాక్టర్ మల్లేశ్వరీ

అబిడ్స్: కంటి వెలుగు కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు చేసినట్లు ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్ బి.మల్లేశ్వరీ తెలిపారు. గోషామహల్, కార్వాన్, నాంపల్లి నియోజకవర్గాల్లోని ఏడు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల ప్రాంతాల్లో కంటి వెలుగు క్యాంపులను నిర్వహిస్తున్నట్లు వివరించారు. పలు ప్రాంతాల్లో బుధవారం ఆమె సందర్శించి ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లేశ్వరీ మాట్లాడుతూ.. రహింపురా ప్లే గ్రౌండ్‌లో గురువారం ఉదయం 9 గంటలకు కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రారంభిస్తారని వెల్లడించారు. జాంబాగ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ దత్తాత్రేయనగర్ అంబేడ్కర్ కమ్యూనిటీహాల్, బేగంబజార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, గోషామహల్ భారత్ కమ్యూనిటీ హాల్, విక్టోరియా ప్లే గ్రౌండ్‌లలో కంటివెలుగు క్యాంపులను నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు.

ఉచితంగా పరీక్షలు, అద్దాల పంపిణీ..

రాష్ట్ర టీఆర్ఎస్ ప్రభుత్వం పేద బడుగువర్గాల ప్రజల కోసం కంటి వెలుగు పథకాన్ని ప్రవేశ పెట్టిందని డాక్టర్ మల్లేశ్వరీ వివరించారు. ప్రతి క్యాంపులో వచ్చేవారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి అద్దాలు పంపిణీ చేస్తామన్నారు. అదేవిధంగా మందులు కూడా ఉచితంగా అందిస్తామన్నారు. అన్ని కేంద్రాల్లో అనుభవజ్ఞులైన కంటి వైద్య నిపుణులచే పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

సద్వినియోగం చేసుకోండి..

కంటివెలుగు పథకాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ మల్లేశ్వరీ పిలుపునిచ్చారు. అన్ని ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. స్థానిక ప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

బహదూర్‌పురా: కంటి వెలుగు కార్యక్రమాన్ని ఫలక్‌నుమా సర్కిల్ పరిధిలో గురువారం నుంచి ప్రారంభించనున్నట్లు ఫలక్‌నుమా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తెలిపారు. ఫాతిమానగర్ కమ్యూనిటీహాల్ బస్తీ దవాఖానా, తీగలకుంట సాలార్-ఎ-మిల్లత్ కమ్యూనిటీహాల్, దూద్‌బౌలి దేవిబాగ్ కమ్యూనిటీహాల్, చందులాల్ బారాదరి ఒవైసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్, రామ్నాస్‌పురా మోచీ కాలనీ కమ్యూనిటీహాల్, కిషన్‌బాగ్ పార్కు ప్రాంతాల్లో కంటి వెలుగు కార్యక్రమాలు కొనసాగనున్నాయన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉచితంగా కంటి వైద్య పరీక్షలతో పాటు అవసరమైన వారికి కంటి శస్త్ర చికిత్సలు, కంటి అద్దాలను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.